వినోదానికొక వింతగాథ

# ఆంధ్రదేశ రాజకీయపటం

"హితశ్రీ"

"ఇదీ నలభై ఏళ్ళ ఆంధ్రరాష్ట్రోద్యమ చరిత్ర. ఆంధ్రరాష్ట్రం అక్టోబరు ఒకటో తేదీకి అవతరించబోతోంది.అలా ఏర్పడబోయే రాష్ట్రపు రాజకీయ, నైసర్గిక స్వరూపాల్ని గురించి మీకిది వరకే విపులంగా చెప్పాను. మీరంతా మీ చిత్ర కళానైపుణ్యాం అంతా వినియోగించి ముచ్చటగా మన దేశపటం చిత్రించి వొచ్చే క్లాసుకు తప్పక తీసుకురావాలి. రాజధానిగానిర్ణయమైన స్థలంలో అరంగుళం డయామీటర్‌తో ఓ ఎర్రచుక్కను పెట్టండి."

వారంరోజులనించీ ఇంటర్ మీడియేట్ కమర్షియల్ జాగ్రఫీక్లాసులో ఆంధ్రరాష్ట్రం గురించి ఇస్తున్న ఉపన్యాసాన్ని పైమాటలతో ముగించాను.

మర్నాటి క్లాసుకి విద్యార్థులంతా దేశపటాలు చిత్రించుకొచ్చారు. ఆ నైపుణ్యం చూసి నాకే ఆశ్చర్యంవేసింది. అన్ని పటాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. ఒక్కొక్కపటం చూసినట్టు సంతకం చేసి తిరిగి ఇచ్చేస్తున్నాను. చివరిపటం చూసేసరికి గుండె గతుక్కుమంది. ఆ కుర్రాడెవరో అరంగుళం డయామీటర్‌తో రెండుచుక్కలు విడివిడి ప్రదేశాలలో పెట్టాడు. పేరుచూశాను. ఇంకెవరు? ఆ కళ్ళజోడుకుర్రాడే. నేనంటే అతనికీ, అతనంటే నాకూ అసలేపడదు. ఇదేవరస, ఎప్పుడూ.

"ఏమోయ్, రాజధాని ఏదయిందీ అనుమానం వొచ్చిందా?"

"లేదండి."

"మరి, ఇదేమిటి?"

అతనేదో ఆలోచించుకుంటున్నట్టున్నాడు. మాట్లాడలేదు.

"మైడియర్ ఫ్రెండ్, ఒక్కొక్క రాష్ట్రానికి ఒకటే రాజధానీనగరం ఉంటుందని తెలుసా?"

"తెలుసండి."

"మరయితే ఈ వ్యవహారం ఏమిటి?"

"దానికో చిన్న కారణం ఉందండి. మీరేమీ అనకపోతే చెబుతాను."

"చెప్పు."

"పటంగియ్యటం పూర్తయింతరవాత, అప్రయత్నంగా విజయవాడదగ్గిర ఎర్రరంగుతో చిత్రించానండి. తరవాత నేను కాఫీతాగొచ్చేటప్పటికి ఆ రంగు ప్రవహించి కర్నూలుదగ్గిర ఆగిపోయిందండి.అంచేత ఆ పటం చింపేసి మళ్ళీ కొత్తదివేసి, ఈసారి ఎర్రరంగు చిక్కగా కలిపి చిత్రించాను. అన్నట్టు అదీ విజయవాడదగ్గిరే వేశాను. మీరంత చెప్పినా కర్నూలు విషయం నాకు జ్ఞాపకంలేదు. తరవాత మా అన్నయ్యతో ఈ విషయం చెబితే దాన్ని "సైకాలజీ ఆఫ్ ఫర్‌గెట్ ఫుల్‌నెస్" అంటారని, మనుషులోని మనస్తత్వాన్ని గురించి గంటన్నరసేపు మాట్లాడాడుగాని నాకంతగా అర్థంకాలే దనుకోండి. సరే, ఈసారి జరిగిన చిత్రం చూడండి. పటం బాగా కుదిరిందిగదా అని దాన్నిదాచేసి ఇవాళ పొద్దున క్లాసు కొచ్చేటప్పుడు మాస్తే గుండె ఆగిపోయినంత పనయింది. ఈసారి కర్నూలు ప్రాంతంలో ఆ ఎర్రచుక్క ప్రతిబింబం కనిపించింది. రంగు ఆరకుండా కాగితం మడిచాను కాబోలు.

"ఇదేమిట్రా భగవంతుడా?" అనుకుంటుండగా తటాలున ఓకథ జ్ఞాపకం వొచ్చిందండి. దాంతో కర్నూలు రాజధానీ నగరమని వెంటనే గుర్తుకొచ్చింది. విజయవాడ దగ్గిర గుర్తించిన ఎర్రచుక్క తీసేద్దామని కలర్ బాక్సు తీసేసరికి దాంట్లో తెల్లరంగు అయిపోయి ఉంది. క్లాస్‌కి టైం కావటంతో అది అలాగే ఉంచేసి వొచ్చానండి."

పాపం అతనలా అమాయకంగా ఉన్నది ఉన్నట్టు చెప్పేసరికి నాకు కొంచెం జాలివేసింది అదీకాక అతనేదో కథ సంగతి ఎత్తాడు, అదేదో

తెలుసుకోవాలనిపించింది. అంచేత కొంచెం సానుభూతి చూపిస్తున్నట్టుగా అన్నాను.

"పోనీలే. పాపం నీచేతైనట్టు వేశావు. సరే గాని కథ అన్నావు అదేమిటి?"

అతను కొంచెం అనుమానిస్తూ అన్నాడు.

"ఏదో కాశీమజిలీ కథలెండి. చెబితే మీరు నవ్వుతారు." నవ్వనని అభయహస్తం ఇచ్చింతరవాత అతను కథచెప్పటానికి ఉపక్రమించాడు.

"పూర్వం ఒక ప్రఖ్యాత చిత్రకారుడుండేవాడు. అతను మనిషిని చూడకుండానే తలవెంట్రుక ఆధారంగా మనిషి చిత్రపటం గీయగలడు. ఆ దేశపు రాజుగారికి తన కుమార్తె చిత్రపటం గీయించాలని కుతూహలం పుట్టి చిత్రకారుని పిలిపించి అతనికి రాజకుమారి శిరోజం ఇచ్చి పటంతయారుచేయమని ఆజ్ఞాపించాడు. ఆ మహాశిల్పి చిత్రపటం అత్యద్భుతంగా తయారుచేశాడు. చిట్టచివరి హంగులుకూడా పూర్తిచేసి, రాజకుమారి లలాటఫలకంమీద తిలకందిద్దాడు. కాని ఓ చిన్న తమాషా జరిగింది. ఆతిలకం లలాటంనుంచి జారిపోయి కాలి బొటనవ్రేలిమీద స్థావరం ఏర్పచుకుంది. అది తన పొరపాటని భావించి ఆ చిత్రకారుడు, కాలి వ్రేలిమీది రంగుతీసివేసి మళ్ళీ తిలకం దిద్దాడు. ఈసారీ, ఇంకోసారీకూడా అలాగే జరిగింది. అతను ఆశ్చర్యపోయి ఒకక్షణం తీవ్రంగా ఆలోచించి ఆ కాలి వేలిమీదికి జారిన రంగు తుడిచివేయకుండా అలాగే ఉంచి తిలకం దిద్దితే అది అలాగే ఉండిపోయిందిట. ఇందులో భావం ఏమిటంటారు?"

ఆ కుర్రాడు నదురూ బెదురూ లేకుండా నన్నే ఎదురుప్రశ్న వేయటం ఎంతో అవిధేయతగా తోచినా, ఆ క్షణంలో అతన్నేమీ అనటానికి ఆస్కారం లేకుండాపోయింది. ఎంచేతంటే అతను వేసినప్రశ్నకి సరైన సమాధానం చెబితే నా తెలివి తేటలు రుజువై అతనికి నామీద గౌరవభావం ఏర్పడటానికి అవకాశం ఉంది. అందులో ఆ సమాధానం నాకు తెలిసిందే. ఎంచేతంటే ఆ కథ ఇదివరకే నేను వినిఉన్నాను. కాని ఏమీ తెలియనట్టూ, అప్పుడు ఆలోచించి చెప్పినట్టూ యథాలాపంగా అన్నాను.

"ఆఁ, భావానికేముందీ, బహుశా ఆ అమ్మాయి కాలిచాటున వేలుమీద ఓ పుట్టుమచ్చ ఉంది కాబోలు."

ఆ కుర్రాడు నా సమాధానానికి దిమ్మెరపోవటం అలాఉంచి, చాలా నిర్లక్ష్యంగా అన్నాడు.

"పుట్టుమచ్చా కాదు, ఏమీకాదు. అది ఆ రాజకుమారి పెద్దలు కొంతమంది కలిసి బలవంతంగా వేసిన ముద్రండీ. పూర్వం దొంగల భయం ఉండేదిట బాగా. అదీకాక అమ్మాయిని గుర్తుపట్టటానికి వీలుగా ఉంటుందని చిన్నప్పుడు గుండ్రగా కాలి బొటనవేలిమీద చురకవేశారట. అదీ సంగతి."

అతను ఆగాడు. నా సమాధానం రైటు కానందుకు నాకు చాలా చిన్నతనంవేసింది. ఆ కోపం కనపరుస్తూ అన్నాను.

"ఈ కథకీ, ప్రస్తుతాంశానికీ సంబంధం ఏముంది?" ఆ కుర్రాడు ఆలోచిస్తున్నట్టుగా అన్నాడు.

"లేదంటారా? నాకు మాత్రం ఏదో పోలిక కనిపిస్తూనే ఉందండీ. ఆముద్ర...ఆముద్ర..."

క్లాసంతా నా ఓటమిని గుర్తించి నవ్వుకుంటున్నట్టుగా తోచింది. అంచేత ఓ చిన్న విట్ వేద్దామని అన్నాను, ఆ నవ్వులో ఈ విషయం మర్చిపోతారని ఆశిస్తూ.

"ఆ రోజుల్లో గనక గాని, ఇప్పుడైతే ప్లాస్టిక్ సర్జరీచేస్తే సరిపోయేది."

కుర్రాళ్ళకి నవ్వు అందించాను, గాని వాళ్లు పైకి నవ్వకుండా ఒకళ్ళ ముఖాలు ఒకళ్లు చూసుకున్నారు ఏదో సంజ్ఞామాత్రంగా, ఆ కుర్రాడు మటుకు నావైపు అలాగే కళ్ళప్పగించి ఏదో ఆలోచిస్తున్న వాడిలా చూసి అర్థస్వగతంగా గొణిగాడు. "ప్లాస్టిక్ సర్జరీ! ప్లాస్టిక్ సర్జరీ!"

---

దర్పరహితమైన తీవే ఔన్నత్యానికి ముఖ్యలక్షణంగా పూర్వం పరిగణించబడేది. కాని, నైతిక విలువలలో విప్లవం పూర్తిఅయిన తరువాత తీవిలేని దర్పమే ఉన్నతికి లక్షణం అనిపించుకుంటూంది.—లాండర్